సాక్షి శ్రీకాకుళం

బుధవారం । 10 । జూలై । 2024



విత్తన శుద్ధి..

తెగుళ్ల నివారణకు విత్తన శుద్ధి చేయాలి. దిగుబడులూ పెరుగుతాయి.

- 8లో



విద్యార్థుల సంక్షేమం ముఖ్యం

వెన్నెలవలస ఆశ్రమ పాఠశాలను అధికారులు తనిఖీ చేశారు. విద్యార్థులను చక్కగా చూసుకోవాలని తెలిపారు.

- 8లో

డిగ్రీ ఇన్‌స్టెంట్ పరీక్షకు 241 మంది హాజరు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ చివరి ఏడాది ఒక్క సబ్జెక్టులో ఫెయిలైన విద్యార్థులకు మంగళవారం ఇన్‌స్టెంట్ పరీక్ష నిర్వహించారు. వర్సిటీ సైన్స్ కళాశాలలో పరీక్ష మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహించగా, 259 మందికి గాను 241 మంది హాజరయ్యారు. 18 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలను ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ పర్యవేక్షించారు. త్వరలో ఫలితాలు వెల్లడించనున్నట్లు వివరించారు.

న్యూస్‌రీల్

టెక్కలిలో ఇసుక అమ్మకాలు ప్రారంభం



ఇసుక అమ్మకాలను ప్రారంభిస్తున్న సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ తదితరులు

టెక్కలి: టెక్కలి ఆర్టీసీ డిపోకు ఆనుకుని ఉన్న స్టాక్ పాయింట్ వద్ద మంగళవారం ఇసుక అమ్మకాలు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన ఉచిత ఇసుక విధానంలో భాగంగా టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, మైన్స్ ఏడీ ఫణిభూషణ్‌రెడ్డి నేతృత్వంలో అమ్మకాలను మంగళవారం ప్రారంభించారు. టన్ను ఇసుక రూ.340ల చొప్పున ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు అమ్మకాలు చేసే విధంగా అధికారులు ఏర్పాటు చేశారు.

ఐదు ఇసుక లారీలు స్వాధీనం



పోలీస్ స్టేషన్‌లో సీజ్ చేసిన లారీలు

ఎచ్చెర్ల క్యాంపస్: జాతీయ రహదారిపై చిలకపాలెం వద్ద సెబ్ చెక్ పోస్టును ఏర్పాటు చేశారు. ఇక్కడ ఐదు ఇసుక లారీలను మంగళవారం పట్టుకొని ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారి వద్ద ఉన్న ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. ఒడిశా రాష్ట్రం నుంచి, కరజాడ రీచ్ నుంచి ఈ లారీలు వచ్చినట్లు గుర్తించారు. ఎలాంటి రశీదులు, ఆధారాలు లేకపోవటంతో ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు ఐదు ఇసుక లారీలు సీజ్ చేసినట్లు ఎస్ఐ ఎస్.చిరంజీవి తెలిపారు.

పాలిటెక్నిక్ ప్రవేశాల తుదివిడత కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: పాలిటెక్నిక్ తుది విడత ప్రవేశాలకు సంబంధించి పాలీసెట్–2024 తుది విడత కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ సంస్థ మంగళవారం విడుదల చేసింది. మొదటి విడతలో జిల్లా పరిధిలో ప్రభుత్వ, ప్రైవేట్ 10 పాలిటెక్నిక్‌లు ఉండగా, 2674 సీట్లకు 1427 ప్రవేశాలు జరిగాయి. తుదివిడత ప్రవేశాల కౌన్సెలింగ్‌లో మొదటి విడత సీట్లు వచ్చిన విద్యార్థులు కళాశాలలు మార్చుకోవచ్చు. పాలీసెట్ ర్యాంకు వచ్చి కౌన్సెలింగ్‌కు హాజరు కాని విద్యార్థులు హాజరై సీట్లు పొందవచ్చు. షెడ్యూల్ మేరకు ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ధ్రువీకరణ పత్రాల పరిశీలన శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని సహాయ కేంద్రంలో 11 నుంచి 13వ తేదీ వరకు నిర్వహిస్తారు. ఆప్షన్ల ఎంట్రీ 11వ తేదీ నుంచి 14వ తేదీ వరకు నిర్వహిస్తారు. సీట్ల అలాట్‌మెంట్ 16వ తేదీన ప్రకటిస్తారు. సీటు లభించిన కళాశాలలకు 18 నుంచి 20వ తేదీ మధ్య హాజరు కావాల్సి ఉంటుంది. షెడ్యూల్ మేరకు కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని శ్రీకాకుళం ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ జి.దామోదర్ రావు తెలిపారు.

లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై అవగాహన

శ్రీకాకుళం పాతబస్టాండ్: పని చేసే ప్రదేశాలు, కార్యాలయాల్లో లైంగిక వేధింపుల నుంచి మహిళలకు రక్షణ కల్పించే చట్టం ఉందని, దీనిపై అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు తెలిపారు. మంగళవారం జిల్లా కోర్టు భవనంలో జిల్లా న్యాయాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో గల ఆస్పత్రుల సిబ్బంది, ఫ్యాక్టరీస్, షాపింగ్ మాల్స్, ఇతర కార్మికులకు లైంగిక వేధింపులకు సంబంధించి చట్టాలపై అవగాహన కల్పించారు. అలాగే బైక్‌పై ప్రయాణం చేసేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.సుదర్శన దొర, ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ అజయ్ కార్తికేయ, ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు, ఆర్‌టీఓ మంగాదేవి, డీసీపీఓ కేవీ రమణ, మోటార్ ఇన్‌స్పెక్టర్ పీవీ గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి సన్యాసినాయుడు



టెక్కలి స్టాక్ పాయింట్ వద్ద ఇసుక కోసం వాహనాలతో పడిగాపులు కాస్తున్న వాహనదారులు

ఉచ్చులో వేసి చిత్తు చేసే తంత్రం

ఉచిత ఇసుక ప్రకటనల గుట్టు రట్టయ్యింది. ఇసుక పంపిణీ ప్రారంభించిన రెండో రోజుకే వినియోగదారుడికి అసలు విషయం అర్థమైపోయింది. దీంతో పాటు ఎడ్ల బళ్లపై ఇసుక తరలిస్తూ పొట్ట పోసుకుంటున్న వారికి కూడా ప్రభుత్వం ఓ జీఓతో జెల్ల కొట్టింది. ఇకపై ఇసుకతో ఎడ్ల బళ్లు కనిపిస్తే జరిమానా విధించాలంటూ ఉత్తర్వులిచ్చింది.

- ఇసుక స్టాక్ పాయింట్ల వద్ద అయోమయ పరిస్థితి
- రూ.1700 చెల్లిస్తేనే ట్రాక్టర్‌కు ఇసుక
- వీటికి అదనంగా రవాణా చార్జీలు చెల్లిస్తేనే వినియోగదారుడికి..
- ఇసుక ఎడ్ల బళ్లపైనా ఆంక్షలు



కొత్తూరు మండలం అంగూరు వద్ద ఇసుక నిల్వలు

● ఎడ్ల బళ్ల యజమానులకు షాక్

శ్రీకాకుళం పాతబస్టాండ్: కొత్త ప్రభుత్వం రూపొందించిన కొత్త చట్టాలు, కొత్త నిర్ణయాలు పేదల పుట్టి ముంచుతున్నాయి. ఇసుక నూతన పాలసీ కూడా ఇలాగే ఉంది. ఇప్పటి వరకు పేదలు నాటు బళ్లతో ఇసుకను నది నుంచి తీసుకువెళ్లేవారు. ఇక నుంచి ఈ బళ్లు ఆగిపోనున్నాయి. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం జీఓ 43ను విడుల చేసింది. ఈ జీఓ ప్రకారం ఇసుక బళ్లతో ఎవరైనా తొలిసారి పట్టుబడితే రూ.2000, రెండో సారి పట్టుబడితే రూ.3000, పదేపదే పట్టుబడితే రూ.5000 జరిమానా విధించనున్నారు. ఇందుకు మార్గదర్శకాలు వచ్చాయి. దీంతో నాటుబళ్లతో ఇసుక రవాణాకు చెక్ పడుతోంది. ఫలితంగా జిల్లాలో ఇసుక బళ్లను నమ్ముకుని జీవిస్తున్న వేలాది మంది పేద కార్మికుల జీవితాలు రోడ్డున పడనున్నాయి. జిల్లాలో ప్రధానంగా నాగావళి, వంశధార, మహేంద్ర తనయ, చిన్న చిన్న గెడ్డలు, వాగులు నుంచి ఇసుకను తీసుకొని గ్రామాల్లోకి ఇసుక బళ్లపై తరలించేవారు. చాలా ఏళ్లుగా వీరు ఇదే జీవనాధారంగా బతుకుతున్నారు. శ్రీకాకుళం పరిసరాల్లో ఉన్న నాగావళి వంశధార నదీ పరివాహక ప్రాంతాల గ్రామాలు బైరి, కరజాడ, కళ్లేపల్లి, బట్టేరు, హయాతినగరం, ముద్దాడ, గోపీనగరం, తోటాడ, రాగోలు, చాపురం, వంజంగి వంటి ప్రాంతాల్లో ఎండ్ల బళ్లు సుమారుగా 1000 వరకు ఉంటాయి. జిల్లా మొత్తం కూడా చాలామంది ఉన్నారు. వీరంతా ఉపాధి కోల్పోనున్నారు.

● కొంతమందికే ఇసుక

టెక్కలి: టెక్కలి ఇసుక స్టాక్ పాయింట్ వద్ద గంటల కొద్దీ నిరీక్షించినా అందరికీ ఇసుక దొరకలేదు. మంగళవారం ఉదయం 9 గంటలకు ఇసుక అమ్మకాలు ప్రారంభించినప్పటికీ సాయంత్రం సరిగ్గా 6 గంటలకే పంపిణీ ఆపేశారు. వాస్తవానికి ఉదయం 6 గంటల నుంచి పంపిణీ చేయాల్సి ఉంది. సోమవారం ఇసుక పంపిణీ చేస్తామని ప్రకటన చేయడంతో, మొదటి రోజు వందలాది ట్రాక్టర్లతో యజమానులు, కార్మికులు సాయంత్రం వరకు పడిగాపులు కాశారు. తీరా పంపిణీ ప్రారంభించకపోవడంతో నిరాశగా వెనుదిరిగారు. రెండో రోజు పంపిణీ ప్రారంభించినప్పటికీ, డబ్బులు తీసుకుని రశీదులు ఇస్తున్న సిబ్బంది కేవలం ఇద్దరు మాత్రమే ఉండడంతో, నమోదు ప్రక్రియలో తీవ్ర ఆలస్యం చోటు చేసుకుంది. దీంతో కొంత మందికి మాత్రమే ఇసుక విక్రయించారు. ఎంతగా విన్నవించినప్పటికీ అధికారుల నుంచి స్పందన లేకపోవడంతో చాలామంది నిరాశగా ట్రాక్టర్లతో వెనుదిరిగారు.

ఉచితం అని చెప్పి టన్ను రూ.340 చొప్పున ట్రాక్టర్‌కు రూ.1700 వసూలు చేస్తున్నారు. అంతే కాకుండా పంచాయతీ ఆశీల పేరుతో రూ.50 తీసుకుంటున్నారు. స్టాక్ పాయింట్ నుంచి తీసుకువెళ్లిన ఇసుకను కొంత మంది స్థానికంగా రూ.3 వేల నుంచి రూ.3500 వరకు అమ్మకాలు చేస్తున్నట్లు అధికారుల దృష్టికి వెళ్లింది. ఇది కాకుండా దూరానికి అనుగుణంగా రవాణా చార్జీలు పెంచే పరిస్థితులు కనిపిస్తున్నాయి.



టైమ్ పేరుతో ఇసుక ఇవ్వకుండా ఇబ్బంది పెట్టవద్దంటూ టెక్కలిలో సిబ్బందిని బతిమలాడుతున్న వాహనదారులు



కొత్తూరు మండలం అంగూరు వద్ద ఉన్న ఇసుక స్టాక్ పాయింట్ నుంచి ఇసుక లోడు చేస్తున్న దృశ్యం

కొత్తూరు: ఉచిత ఇసుక ప్రకటన చూసి ఆశపడిన ట్రాక్టర్ యజమానులు స్టాక్ పాయింట్‌కు వెళ్లి ఖంగు తింటున్నారు. కొత్తూరు మండలం అంగూరు వద్ద స్టాక్ పాయింట్ ఉంది. ఈ పాయింట్ వద్ద ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని ఈ నెల 8న ప్రారంభించింది. దీంతో కొత్తూరు, హిరమండలం, పాతపట్నం మండలాల నుంచి మంగళవారం పలు ట్రాక్టర్‌లను ఇసుక కోసం ఇసుక వినియోగదారులు పంపించారు. ఇక్కడ ఒక టన్నుకు రూ.340గా ధర నిర్ణయించారు. ట్రాక్టర్ లోడు ఎత్తాలంటే ఐదు టన్నులు కావాలి. దీంతో మొత్తం రూ.1700 కట్టాల్సి రావడంతో ట్రాక్టర్ డ్రైవర్లు బిక్కచచ్చిపోయారు. ఉచిత ఇసుక పేరు చెప్పి ఇలా డబ్బు వసూలు చేయడంపై వారు మండిపడ్డారు. అంగూరు ఇసుక స్టాక్ పాయింట్ నుంచి ధనుపురం గ్రామానికి ఒక ట్రాక్టర్ ఇసుక వేయడానికి ఐదు టన్నుల ఇసుక రూ.1700, ట్రాక్టర్ అద్దె రూ.2500 కలిపి రూ. 4200 అవుతోంది. దూరాన్ని బట్టి ఈ మొత్తం ఇంకా పెరుగుతుంది. దీంతో వినియోగదారులు ప్రభుత్వంపై దుమ్మెత్తిపోస్తున్నారు.

● ఉచితం అన్నారు..

ఉచితం ఎలా అవుతుంది

ఒక ట్రాక్టర్‌కు 5 టన్నుల ఇసుక పడుతుంది. ఐదు టన్నులకు రూ. 1700 చెల్లించాం. ఇక ఉచితం ఎలా అవుతుంది. ఉచిత ఇసుక అని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రచారం చేశారు. ఇప్పుడేమో ఇంత ధర చెల్లించి ఇసుక కొనాల్సి వస్తోంది. వినియోగదారులు ట్రాక్టర్ అద్దె డబ్బులు మాత్రమే ఇస్తున్నారు. ఇసుకకు కూడా కలిపి అడిగితే ఉచితం కదా అంటున్నారు.

– తూలుగు ధర్మారావు, ట్రాక్టర్ యజమాని, ధనుపురం

ఎన్నికల నిధుల పంపిణీలో ▶ చేతివాటం

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎన్నికల సమయంలో పంచాల్సిన అలవెన్సుల విషయంలో శ్రీకాకుళం నియోజకవర్గం తీరు వేరుగా కనిపిస్తోంది. ఎలక్షన్ల సమయంలో పనిచేసిన కింది స్థాయి సిబ్బందికి చెల్లించాల్సిన అలవెన్సులు, వారు ఆ సమయంలో పెట్టిన ఖర్చులు ఎగవేసే స్థితికి శ్రీకాకుళం నియోజకవర్గ ఎన్నికల అధికారులు చేరుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. భోజనం, వసతులు, సామగ్రి, టెంట్లు, రవాణా వంటివి సరఫరా చేసిన ఏజెన్సీలు ఇప్పుడు డబ్బులు అందక ఇబ్బంది పడుతున్నాయి.

జిల్లాలో ఎనిమిది శాసన సభ నియోజకవర్గాలు ఉండగా వీటిలో శ్రీకాకుళం అసెంబ్లీ నియోజకవర్గంలో అవినీతి బిల్లులు ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. ఇటీవల కలెక్టర్ మారడంతో మిగిలిన నిధులు కాజేసి వెళ్లిపోవడానికి 'కొందరు అధికారులు' సిద్ధంగా ఉన్నట్లు భోగట్టా. ఎన్నికల సమయంలో శిక్షణలకు అంతా కలిసి 725 మంది కాగా, వీరి భోజనాల బిల్లులు 1600 మందికి పెట్టారు. అలాగే టీటీ, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్లు, సబార్డినేట్‌లు, వీఆర్వో, వీఆర్ఏ, అవుట్ సోర్సింగ్ సిబ్బందికి ఎన్నిక సమయంలో అదనపు పనిభారం ఉన్నందున వారికి అలవెన్సులు అందజేయడం జరుగుతోంది. శ్రీకాకుళం అసెంబ్లీ నియోజకవర్గంలో ఈ అలవెన్సులు కొందరికి అందలేదు. మరి కొందరికి కోత పెట్టారు. కొంతమంది సిబ్బంది ఇంత తక్కువ నగదు వద్దని నిరాకరించారు. అలవెన్సులు పక్క నియోజకవర్గాలకంటే తక్కువగా ఇచ్చారని శ్రీకాకుళం రెవెన్యూ కార్యాలయంలో ఒక ఉద్యోగి నేరుగా ఆర్డీవో(ఆర్ఓ)కు ఫిర్యాదు చేసినా పట్టించుకునే పరిస్థితి లేదు. పక్క నియోజకవర్గం ఆమదాలవలస వారు అందజేసిన క్రమంలో అందజేయాలని చాలామంది సిబ్బంది ఆర్ఓని కోరినా అక్కడ స్పందన లేక పోవడంతో అడగడం కూడా మానేశారు.



ఆర్థిక విషయాలతో ఆర్ఓకు సంబంధం ఉండదు

ఎన్నికల సమయంలో అయిన ఖర్చులు, టీఏ, డీఏలు, సిబ్బంది చెల్లింపులతో ఆర్ఓగా నాకు ఎలాంటి సంబంధం ఉండదు. అన్ని విషయాలకు సంబంధించి జమలు, చెల్లింపులు ఆర్థిక లావాదేవీలు ఏఆర్ఓ(శ్రీకాకుళం తహసీల్దార్) నిర్వహిస్తారు. నేను మానిటరింగ్ చేయడం తప్ప ఆర్థిక అంశాల్లో తలదూర్చకూడదు. ఎవరికైనా డబ్బులు అందకపోతే నేరుగా ఏఆర్ఓను సంప్రదించాలి. – సీహెచ్ రంగయ్య, ఆర్డీఓ

ఇంకా రావాల్సింది రూ.15.70 లక్షలు

శ్రీకాకుళం అసెంబ్లీ నియోజకవర్గానికి ఇప్పటికే రూ.1,51,68,428లు విడుదల అయ్యాయి. ఇంకా రూ.15,70,921 రావాల్సి ఉంది. అయితే ఇక్కడి ఎన్నికల అధికారుల మాత్రం రూ.2 కోట్లకు పైగా రావాలని బిల్లులు సమర్పించారు. వీటిని ఆడిట్ చేసిన తర్వాత పై మొత్తాన్ని చెల్లించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ప్రధానంగా భోజనం ఏజెన్సీకి రూ.7 లక్షలకుపైగా చెల్లించాల్సి ఉంది. అలాగే ట్రాన్స్‌పోర్టు, టెంట్లు, కొంతమందికి టీఏలు, అన్నీ కలిపి సుమారుగా రూ.20 లక్షలకు పైగా చెల్లింపులు పెండింగ్ ఉన్నాయి. అయితే ఇప్పటికే విడుదలైన సొమ్ము ఏమైందని నియోజకవర్గ సిబ్బంది ప్రశ్నిస్తున్నారు. ఆ సొమ్ములో చాలా వరకు ఇప్పటికే దారి మళ్లించారని, వీటికి తప్పుడు బిల్లులు, అక్విడెన్సులు తయారు చేశారని ఆరోపిస్తున్నారు.

శివారు ప్రాంతాలకు సాగునీరు: కలెక్టర్

హిరమండలం: వంశధార గొట్టా బ్యారేజీ ఎడమ ప్రధాన కాలువ ద్వారా దాదాపు శివారు ప్రాంతాలన్నింటికీ సాగునీరు అందించామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ తెలిపారు. ఆయన మంగళవారం హిరమండలంలోని గొట్టా బ్యారేజ్, వంశధార రిజర్వాయర్, నాగావళి, వంశధార అనుసంధాన హైలెవల్ కెనాల్‌ను పరిశీలించారు. అలాగే రిజర్వాయర్ స్పిల్‌వే వద్ద జరుగుతున్న పనులను కూడా పరిశీలించారు. రిజర్వాయర్ నిర్మాణం, ఇప్పటివరకు జరిగిన పనులు, ఇంకా జరగాల్సిన పనుల గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు.

తాను కొత్తగా వచ్చానని, వంశధార రిజర్వాయర్, గొట్టా బ్యారేజ్ ఎడమ, కుడి ప్రధాన కాలువలు ఎలా ఉన్నాయో చూసేందుకు వచ్చానని తెలిపారు. ఆర్అండ్ఆర్, భూసేకరణ వంటి అంశాల్లో ఏమైనా సమస్యలు ఉంటే తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఖరీఫ్ పనులకు సాగునీరు అందించేందుకు రూ.54 లక్షలతో కాలువల్లో గుర్రపు డెక్క, పూడికల తొలగింపు చేపట్టామన్నారు. సాగునీటిని సుమారు 104 కిలోమీటర్లకు పైగా కాలువల ద్వారా పంపించినట్లు తెలిపారు. త్వరలో కుడి కాలువకు సాగునీరు విడుదల చేస్తామన్నారు. కార్యక్రమంలో టెక్కలి సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్, వంశధార ఎస్ఈ బి.రాంబాబు, కట్టడాల విభాగం ఈఈ ఎంవీ రమణ, తహసీల్దార్ రాంబాబు ఎంపీడీఓ డీడీ స్వరూపారాణి వంశధార ఇంజినీర్లు ఉన్నారు.



అధికారుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్

● ప్రాణదానం





పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ కేటీరోడ్డులో మంగళవారం ఓ పదేళ్ల బాలుడు ప్రాణాపాయ స్థితిలో చిక్కుకున్నాడు. వజ్రపుకొత్తూరు మండలం నువ్వలరేవు గ్రామానికి చెందిన యశ్వంత్ అనే బాలుడు తన తల్లితో కలిసి రోడ్డు దాటుతుండగా బస్సు, ద్విచక్రవాహనం రెండింటి మధ్యలో ఉండిపోయి పడిపోవడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. పూర్తిగా కదలికలు నిలిచిపోవడంతో అదే ద్విచక్రవాహనంపై ఉన్న డాక్టర్ కె.అఖిల్ చిన్నారిని రోడ్డు పక్కకు తీసుకుని వెళ్లి సీపీఆర్ చేశారు. కాసేపటికి బాలుడు స్పృహలోకి రావడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. సమీపంలో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్ బాలుడికి సపర్యలు చేసి వారిని ఆటోలో నువ్వలరేవు గ్రామానికి తీసుకెళ్లారు. – కాశీబుగ్గ

● వరాహ అవతారంలో జగన్నాథుడు

మండలంలోని లక్ష్మీనర్సుపేట గ్రామంలో కొలువైన జగన్నాథస్వామి మంగళవారం వరాహ అవతారంలో దర్శనమిచ్చారు. రథయాత్ర సందర్భంగా ప్రధాన ఆలయంలో గుండిచా మందిరానికి జగన్నాథస్వామి తరలి వెళ్లారు. గుండిచా మందిరంలో పది రోజుల పాటు దశ అవతారాల్లో దర్శనమిచ్చి పూజలు అందుకుంటారని ఆల య అర్చకులు వినోద్ కుమార్ పత్రి తెలిపారు.

-ఎల్.ఎన్.పేట



వరాహ అవతారంలో జగన్నాథ స్వామి

ముద్దాడ, ధర్మవరంలో మలేరియా కేసులు

ఎచ్చెర్ల క్యాంపస్: ముద్దాడ, ధర్మవరం పంచాయతీల పరిధిలో మలేరియా కేసులు బయట పడ్డాయి. దీంతో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది అప్రమత్తమయ్యారు. గ్రామంలో జ్వరం ఉన్న అనుమానితుల నుంచి రక్త నమూనాలు సేకరించారు. గ్రామంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించారు. ఫాగింగ్ యంత్రంతో దోమల నియంత్రణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. స్థానికంగా అవసరమైన మందులు సైతం అందుబాటులో ఉంచారు.

క్లుప్తంగా

8 సోలార్ ప్యానెల్స్ చోరీపై ఫిర్యాదు

బూర్జ: మండలంలో గల చీడివలస గ్రామానికి చెందిన చొక్కర అప్పలనాయుడు అనే వ్యవసాయ రైతుకు చెందిన 8 సోలార్ ప్యానెల్స్‌ను దొంగిలించినట్లు మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పలనాయుడు తనకు ఉన్న రెండు ఎకరాల వ్యవసాయ భూమిలో 2017–018 సంవత్సరంలో 16 సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసికొని తద్వారా బోరు నీటితో పంటలు పండించుకుంటున్నాడు. మే 30వ తేదీ సాయంకాలం పొలానికి వెళ్లి చూడగా 16 సోలార్ ప్యానెల్స్ ఉన్నాయని, అయితే 31న వెళ్లి చూస్తే 8 సోలార్ ప్యానెల్స్ మాత్రమే కనిపించాయని ఆయన ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు స్థానిక పోలీసు స్టేషన్ ఎస్ఐ జి.వి ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్టేట్ రిప్రజెంటేటివ్‌గా భాస్కర్



ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ అంబెం భాస్కర్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా నేషనల్ స్పోర్ట్స్ ప్రమోషన్ ఆర్గనైజేషన్ స్టేట్ రిప్రజెంటేటివ్‌గా ఎంపికయ్యారు. ఈ మేరకు కేంద్ర క్రీడల, యువజన సర్వీసుల శాఖ నుంచి మంగళవారం ఉత్తర్వులు అందాయి. మూడేళ్ల పాటు ఆంధ్రప్రదేశ్ నుంచి కొనసాగనున్నారు. క్రీడల్లో యువతను, విద్యార్థులను ప్రోత్సహించేందుకు కృషి చేస్తారు. జాతీయ స్థాయిలో రాష్ట్రం నుంచి నైపుణ్య క్రీడాకారులను తీర్చిదిద్దటం లక్ష్యంగా ఆయన చెప్పారు.

ఆకట్టుకున్న కళాకారుల ఆత్మీయ కలయిక



కూచిపూడి ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

శ్రీకాకుళం కల్చరల్: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఇంద్ర పుష్కరిణి వద్ద గల వైజయంతీ మండపంలో కళాకారుల ఆత్మీయ కలయిక సుమిత్రా కళాసమితి ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం వేడుకగా నిర్వహించారు. దీపోద్దీపనతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో అభినయ నృత్య నికేతన్ నృత్య దర్శకురాలు టి.నీరజాసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో చిన్నారుల కూచిపూడి నృత్యాలు, కోలాట ప్రదర్శనలు జరిగాయి. అలాగే సంగీత దర్శకుడు పెంకి నాగేశ్వరరావు సంగీత సారథ్యంలో సంగీత సుధ కార్యక్రమంలో చక్కనైన పాటలు ఆలపించారు. సుమిత్రా కళాసమితి అధ్యక్షుడు ఇప్పిలి శంకరశర్మ మాట్లాడుతూ బుధవారం నుంచి 5రోజుల పాటు 216 మంది కవి పండితులతో అవధాన విద్యా సరస్వతి బులుసు అపర్ణచే ద్విశతావధాన కళా విలాసం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సమితి కార్యదర్శి గుత్తు చిన్నారావు, కోశాధికారి నక్క శంకరరావు, ఉపాధ్యక్షులు మండవిల్లి రవి, దండుల పార్థసారది, పులంఖం శ్రీనివాసరావు, సురేష్, బంకుపల్లి శంకరం, రాజు, విజయరామ్, ఎం.వి.కామేశ్వరరావు, రంగస్థల కళాకారుల సమాఖ్య ప్రతినిధులు చిట్టి వేంకటరావు, ఎల్.రామలింగస్వామి, నందికేశ్వరరావు, రామచంద్రదేవ్, కె.రాజేశ్వరి పాల్గొన్నారు.

ఎర్రగోవింద పుట్టుగలో జలయాత్ర



జలయాత్రలో పాల్గొన్న గ్రామస్తులు

కవిటి: ఎర్రగోవిందపుట్టుగలో చింతామణి, కాళీమాత అమ్మవార్ల ఆలయ ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా మంగళవారం గ్రామస్తులు జలయాత్రను నిర్వహించారు. వందలాది మంది మహిళలు మేళతాళాలు, హరేరామ–హరేకృష్ణ నామ సంకీర్తనల మధ్య కలశాలతో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

'జిల్లా అభివృద్ధికి చర్యలు చేపట్టండి'



కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో కలెక్టర్ స్వప్నిల్ దినకర్

శ్రీకాకుళం: జిల్లాను అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్‌కు కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు సూచించారు. కేంద్ర మంత్రి, జిల్లా కలెక్టర్‌లు మంగళవారం కలుసుకున్న సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. పాత్రునివలస వద్ద క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం కేటాయించిన భూమిలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాలన్నారు. పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.

విత్తన శుద్ధి.. సాగు వృద్ధి



పంట పొలాల్లో రైతులతో విత్తనాలను శుద్ధి చేస్తున్న దృశ్యం

- తెగుళ్ల నివారణకు విత్తనశుద్ధి మేలు
- అధిక దిగుబడులకూ సాయం

శ్రీకాకుళం రూరల్: పంట ఏదైనా విత్తనాన్ని శుద్ధి చేసి విత్తుకోవడం వల్ల పంటకు రక్షణ లభిస్తుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. విత్తనాన్ని శుద్ధి చేసి విత్తుకోవడం వల్ల నాటిన తర్వాత 25 నుంచి 30 రోజులు వరకూ చీడపీడలు, తెగుళ్ల నుంచి పంటలకు రక్షణ కల్పిస్తుందని చెబుతున్నారు. ఇప్పుడు చాలా కంపెనీలు విత్తన శుద్ధి చేసిన తర్వాతనే రైతులకు విక్రయిస్తున్నాయి. అయినా రైతులు మరో మారు విత్తన శుద్ధి చేసుకోవడం మంచిదని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా తొలకరి వర్షాలు కురవడంతో కొందరు రైతులు ఇప్పటికే పంటలనుసాగుచేస్తున్నారు. ఈ సందర్భంగా విత్తన శుద్ధి ప్రాధాన్యతపై మండల వ్యవసాయశాఖ అధికారి ఉషాకుమారి పలు సూచనలను అందించారు.

వేరుశనగ

ఒక కిలో విత్తనానికి ఒక గ్రాము టెబ్యుకోనజోల్ 2డీ లేదా 3 గ్రాముల మాంకోజెబ్, ట్రైకోడెర్మావిరిడి పొడిమందును పట్టించాలి. కాండము కుళ్లు, వైరస్ తెగులు (పీఎస్ఎన్‌డీ) వేరు పురుగు ఆశించే ప్రాంతాల్లో కిలో విత్తనానికి 1మిల్లీలీటరు ఇమిడాక్లోప్రిడ్ 600 ఎఫ్ఎస్ (గాచో) 6 మిల్లీలీటర్ల నీళ్ల మిశ్రమంతో విత్తనశుద్ధి చేయాలి. వరిమాగాణుల్లో కొత్తగా వేరుశనగ సాగు చేసేటపుడు విత్తనానికి రైజోబియం కల్చర్‌ను పట్టించాలి. మొదలు, కుళ్లు, వేరుకుల్లు, కాండం కుళ్లు తెగులు ఎక్కువగా ఆశించే ప్రాంతాల్లో కిలో విత్తనానికి 10 గ్రాముల ట్రైకోడెర్మావిరిటి పట్టించాలి. విత్తనాన్ని ముందు క్రిమిసంహారక మందుతో శుద్ధి చేసి నీడలో ఆరబెట్టిన తర్వాత శిలీంధ్ర నాశనితో శుద్ధి చేయాలి.

మిరప

కిలో మిరప విత్తనానికి మొదట వైరస్ తెగులు నివారణకు 150 గ్రాముల ట్రైసోడియం ఆర్థోఫాస్పేట్‌ను లీటరు నీటిలో కరిగించి ఆ మందు ద్రావణంలో 15–30 నిమిషాలు పాటు విత్తనాన్ని నానబెట్టాలి. ఆ తర్వాత రసం పీల్చే పురుగుల నివారణకు 8 గ్రాముల ఇమిడాక్లోప్రిడ్, ఇతర తెగుల్లు నివారణకు 3 గ్రాముల కాప్టాన్ లేదా 3 గ్రాముల మాంకోజెబ్‌తో కలిపి విత్తన శుద్ధి చేయాలి.

మొక్కజొన్న

మొక్కజొన్న కిలో విత్తనానికి 3 గ్రాముల థైరామ్ లేదా కాప్టాన్ మందును కలిపి విత్తనశుద్ధి చేయాలి. మొవ్వ ఈగ నివారణకు కిలో విత్తనానికి 3 గ్రాముల థయోమిథాగ్జమ్ మందును కలిపి విత్తన శుద్ధి చేయాలి.

జొన్న

కిలో విత్తనానికి 3 గ్రాముల థైరామ్ లేదా కాప్టాన్ మందును కలిపి విత్తన శుద్ధి చేయాలి. మొవ్వ రాగ నివారణకు కిలో విత్తనానికి 3 గ్రాముల థయోమిథాగ్జమ్ మందును కలిపాలి.



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి మంగళవారం తాడేపల్లిలో కలిశారు. పాతపట్నం నియోజకవర్గంలోని పరిస్థితిని ఆయనకు వివరించారు.

ఇది పాఠశాలా.. పశువుల శాలా



ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

సరుబుజ్జిలి: సర్వాంగ సుందరంగా ఉండాల్సిన పాఠశాల వాతావరణం పశువుల శాల కంటే అధ్వానంగా ఉందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన మండలంలోని రొట్టవలస జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఆహ్లాదంగా ఉండాల్సిన పాఠశాల ఉపాధ్యాయుల నిర్లక్ష్యం వల్ల ఇలా మారుతోందని అసహనం వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణలో ఉన్న మొక్కలు పూర్తిగా ఎండిపోవడం, పారిశుద్ధ్య లోపంపై పాఠశాల నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

'రాజ్యాధికారంలో మాలలకు ప్రాధాన్యత ఇవ్వాలి'



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న దళిత సంఘ జేఏసీ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన మాలలకు రాజ్యాధికారంలో తగిన ప్రాధాన్యత ఇవ్వాలని దళిత సంఘాల జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. జనాభా ప్రాతిపదికన మాలలకు మంత్రివర్గంలో స్థానాలను పెంచాలని సీఎం చంద్రబాబు నాయుడును కోరారు. ఉపముఖ్యమంత్రి పదవిని మాలలకు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. శ్రీకాకుళం నగరంలోని ఎన్‌జీఓ హోమ్‌లో మంగళవారం దళిత సంఘాల జేఏసీ నేతలు కంఠ వేణు, తైక్వాండో శ్రీను విలేకరులతో మాట్లాడారు. మంత్రి వర్గంలో జనాభా ప్రాతిపదికన పదవులు కేటాయించలేదన్నారు. అంబేడ్కర్ జీవిత చరిత్రను, రాజ్యాంగంలోని సారాంశాలను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలన్నారు. సమావేశంలో దళిత సంఘాల జేఏసీ నేతలు యజ్జల గురుమూర్తి, పురుషోత్తం, రాంబాబు, సుంకు రమణ,నేతల అప్పారావు, అరుబారిక రాజు, పట్నాన మహేష్, పెయ్యల చంటి, పంకు మురళీ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు



రణస్థలం మన గ్రోమోర్ ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

రణస్థలం: సక్రమంగా బిల్లులు లేని ఎరువులను అమ్మరాదని తాడేపల్లిగూడెం వ్యవసాయ సహాయ సంచాలకులు పి.మురళీకృష్ణ, విజిలెన్స్ డీఎస్పీ ఎస్.కిరణ్ కుమార్ తెలిపారు. మండలంలోని విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో వ్యవసాయ విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. రణస్థలం మండల కేంద్రంలోని మన గ్రోమోర్ ఎరువుల దుకాణంలో తనిఖీలు చేశారు. దుకాణంలో విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల సంబంధించిన రికార్డులు, బిల్లులు, గోడా న్ స్టాక్ నిల్వలను తనిఖీ చేశారు. ఈ తనిఖీ సమయంలో దుకాణంలో రూ. 4,59,389 బయో ఎరువుల విక్రయాలు నిలుపుదల చేశారు. సరైన పత్రాలు సమర్పించినంత వరకు విక్రయాలు చేయకూడదని అదేశించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ నాణ్యత నియంత్రణ అధికారి మురళీధర్, ఏడీఏ వి.శ్రీనివాసరావు, ఏఓ డి.విజయభాస్కర్‌లు ఉన్నారు.

అక్రమ మట్టి తవ్వకాలపై కొరడా



తవ్వకందారులను పట్టుకున్న తహసీల్దార్ తిరుమల బాబు

కాశీబుగ్గ: మందస సమీపంలో ఉన్న గోపాలసాగర్‌లో అక్రమ మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. మంగళవారం మట్టి తరలింపుపై అందిన సమాచారం మేరకు మందస రెవెన్యూ అధికారుల బృందం ఆకస్మిక దాడులు నిర్వహించారు. జేసీబీతో మట్టిని తవ్వి సమీప రియల్ ఎస్టేట్ వెంచర్‌కు తరలింపు జరుగుతుందన్న సమాచారం మేరకు దాడులు చేశారు. మందస తహసీల్దార్ తిరుమల బాబు, డి.టి.కృష్ణమూర్తి, ఆర్ఐ చిన్నారావు, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారు. అక్రమ మట్టి తవ్వకాలు, తరలింపునకు పాల్పడుతున్న రెండు జేసీబీలు, ఆరు ట్రాక్టర్లను అధికారులు పట్టుకున్నారు. వీటిని పోలీస్ స్టేషన్‌కు తరలించి, రికార్డులు పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తిరుమల బాబు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: సీజనల్ వ్యాధులపై ప్రత్యేక దృష్టి సారించాలని, మెరుగైన వైద్యసేవలు అందించాలని, ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం చేయరాదని కలెక్టర్ మెజిస్ట్రేట్, స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వైద్య అధికారులకు ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం వైద్యారోగ్యశాఖపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మలేరియా మరణాల గురించి సమీక్ష నిర్వహించారు. కోటబొమ్మాళి, పొన్నాడ, వెన్నెలవలస రెసిడెన్సియల్ స్కూళ్లలో జరిగిన ఘటనలు ప్రస్తావిస్తూ తగు చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. 11న నిర్వహించనున్న ప్రపంచ ఆరోగ్య దినోత్సవం బ్యానర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు.

నాగావళి రివర్ ఫ్రంట్ అభివృద్ధికి ప్రణాళికలు



పురపాలక సంఘం అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: నగరం మీదుగా ప్రవహిస్తున్న నాగావళి నది (రివర్ ఫ్రంట్) అభివృద్ధికి, సుందరీకరణకు ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఆయన కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు తదితర అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాగావళి నదీ పరీవాహక ప్రాంతాన్ని పర్యాటకంగా వేగంగా అభివృద్ధి చేసేలా ప్రాజెక్టులను గుర్తించాలని అన్నారు. నిపుణుల కమిటీ, సలహా కమిటీల ఏర్పాటుపై నిర్దిష్ట ఉత్తర్వులతో రావాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే శ్రీకాకుళం నగరంలో నాగావళి నది వెంబడి ఉన్న విహార ప్రదేశాల గురించి అడిగి తెలుసుకున్నారు. గూగుల్ మ్యాప్ సాయంతో నది తీర ప్రాంత వాస్తవ పరిస్థితులను కొద్దిసేపు అధ్యయనం చేశారు. తొలి విడతలో కోడి రామ్మూర్తి స్టేడియం వెనుక నుంచి కొత్త బ్రిడ్జి వరకు నాగావళి నదికి ఒకవైపు రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు పేరుతో ఆహ్లాదకరమైన ఘాట్లు, కనీసం 15–20 అడుగుల వెడల్పు గల నడక మార్గాన్ని అభివృద్ధి చేయాలని, సిట్టింగ్ బెంచీలు, గ్రీన్ కవర్ వంటి సౌకర్యాలు, విశాలమైన పార్కింగ్, అద్భుతమైన లైటింగ్ ఏర్పాటు చేసేలా ప్రాజెక్టుకు ప్రణాళికను రూపొందించాలని సూచించారు. నాలుగైదు కిలోమీటర్ల మేర తొలి విడత అభివృద్ధి పూర్తిచేసి మలి విడతలో పొన్నాడ బ్రిడ్జి నుంచి డే నైట్ వద్ద స్వర్గధామం వరకు పర్యాటకంగా అభివృద్ధి చేయాలని ఆదేశించారు. సమావేశంలో కమిషనర్ ఓబులేసుతో పాటు నీటిపారుదల శాఖ ఎస్ఈ పొన్నాడ సుధాకర్, పబ్లిక్ హెల్త్ ఈఈ సుగుణాకర రావు, మున్సిపల్ ఇంజనీర్ గంగాధర్ రావు, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

చెరువు ఆక్రమిస్తే క్రిమినల్ చర్యలు



ఆర్డీఓ రంగయ్యకు చెరువు పరిస్థితి వివరిస్తున్న రైతులు

ఎచ్చెర్ల క్యాంపస్: చెరువు ఆక్రమిస్తే చట్ట పరంగా క్రిమినల్ చర్యలు తీసుకుంటామని శ్రీకాకుళం ఆర్డీఓ రంగయ్య స్పష్టం చేశారు. బొంతలకోడూరు గ్రామస్తులు సోమవారం మల్లిపెద్దివాని చెరువు ఆక్రమణపై అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై సాక్షిలో 'చెరువుపై అధికార పార్టీ నాయకుల కన్ను' శీర్షికన కథనం వెలువడింది. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీఓ చెరువును పరిశీలించారు. రెవెన్యూ అధికారుల వద్ద ఉన్న మొత్తం రికార్డులు పరిశీలించారు. మల్లిపెద్దివానిచెరువు సర్వే నంబర్ 39లో 2.61 ఎకరాల్లో విస్తరించి ఉంది. ప్రభుత్వ పోరంబోకు స్థలంగా గుర్తించారు. సర్పంచ్ పంచిరెడ్డి రాంబాబు, ఎంపీటీసీ మాడుగుల జగదీష్ ప్రస్తుత పరిస్థితి వివరించారు. ఫేక్ పట్టాతో కొందరు ఆక్రమణలకు ప్రయత్నిస్తున్నారని, రాత్రిళ్లు కప్పేందుకు తీవ్ర ప్రయత్నం చేస్తున్నారని వివరించారు. ఆక్రమణలకు పాల్పడితే తీవ్ర చర్యలు ఉంటాయని అన్నారు. మరో పక్క చెరువును ప్రభుత్వ చెరువుగా నిర్ధారించి సమగ్ర నివేదిక తహసీల్దార్ శ్యాం కుమార్ ఈనెల 7వ తేదీన అందజేశారు.

ఉరి వేసుకుని వలస కార్మికుడు మృతి



ఉరి పోసుకున్న రాజేష్ నాయక్

సారవకోట: మండలంలోని గొర్రిబంద పంచాయతీ రైవాడ గ్రామానికి సమీపంలో గల కొండపై గల చెట్టుకు ఉరి వేసుకుని మధ్య ప్రదేశ్‌కు చెందిన రాజేష్ నాయక్ (28) సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం హిరమండలం మండలం కొత్తపేట గ్రామంలో మధ్యప్రదేశ్‌కు చెందిన కొంతమంది గ్రామాలలో కుర్చీలు అమ్ముకుని జీవిస్తున్నారు. వారిలో ఒకరైన రాజేష్ నాయక్ సారవకోటలో కుర్చీలు అమ్మి అనంతరం రైవాడ కొండ దగ్గర ఉరి పోసుకున్నాడు. కుటుంబ కలహాల కారణంగా ఉరి పోసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి సోదరుడు జితేంద్ర నాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ అప్పారావు కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య రినూ భాయ్, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి మృతి



జాతీయ రహదారి వంతెన కింద ఉన్న వ్యక్తి మృతదేహం

కాశీబుగ్గ: మందస మండలం కొర్రాయిగేటు అండర్ పాస్ కింద ముకేష్ (45)అనే మతిస్థిమితం లేని వ్యక్తి మరణించి కనిపించాడు. మృతదేహాన్ని గమనించిన స్థానికులు మందస పోలీసులకు సమాచారం అందజేశారు. ఇతని వద్ద చంద్రగిరి సామాజిక ఆస్పత్రిలో ట్రీట్మెంట్ పొందినట్లు మందుల చీటీ ఉందని, యాచకుడిగా మారి బతుకుతున్నాడని పోలీసులు తెలిపారు. సమాచారం తెలిసిన వారు పోలీసులను సంప్రదించాలని కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్న ఏఎస్ఐ శేఖర్ తెలిపారు.


అవుట్ లుక్ ఐకార్ ర్యాంకింగ్‌లో ప్రథమ స్థానం



సెంచూరియన్ వర్సిటీ క్యాంపస్

పర్లాకిమిడి: గజపతి జిల్లా ఆర్.సీతాపురం సెంచూరియన్ వర్సిటీలోని ఎంఎస్ స్వామినాథన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు అవుట్ లుక్ ఐకార్ ర్యాంకింగ్–2024లో ప్రథమ స్థానం లభించడం గర్వకారణంగా ఉందని వర్సిటీ ఉపకులపతి డా.సుప్రియా పట్నాయక్ తెలిపారు. సెంచూరియన్ వర్సిటీ అకడమిక్ ఎక్సలెన్స్ ఫ్యాకల్టీ నాణ్యతా ప్రమాణాలతో పాటు మౌలిక సౌకర్యాలు, పరిశోధన శాఖను పరిశీలించి ఈ ర్యాంకు ఇచ్చినట్లు ఆమె తెలిపారు. కళాశాల ఫ్యాకల్టీ అంకిత భావం, ఆకట్టుకునే ప్రదర్శన, అగ్రిఫెస్ట్‌లతో అద్భుతమైన మైలురాయిని సాధించిందన్నారు. కళాశాల ఒడిశాలో నంబర్ వన్ స్థానం సాధించడంపై వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య డి.ఎన్.రావు హర్షం వ్యక్తం చేశారు. భారతదేశంలోనే అత్యుత్తమ విద్యనందించే వర్సిటీల్లో సెంచూరియన్ ఒకటిగా నిలవడం ఆనందంగా ఉందన్నారు.

'విద్యార్థుల సంక్షేమం ముఖ్యం'



ఆశ్రమ పాఠశాల సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి ప్రసన్న

సరుబుజ్జిలి: గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా సిబ్బంది పని చేయాలని సీజనల్ వ్యాధులు ప్రత్యేకాధికారి, జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి వీఎస్ఎస్ఎల్ ప్రసన్న తెలిపారు. ఇటీవల వెన్నెలవలస ఆశ్రమ పాఠశాలలో మలేరియా జ్వరంతో బిడ్డిక రష్మిత అనే విద్యార్థిని మృతి చెందింది. దీంతో ఆమె మంగళవారం ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. మలేరియా పాజిటివ్ కేసులకు తీసుకున్న జాగ్రత్తల గురించి వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అలాగే బాలికల వసతి గృహం, మరుగుదొడ్లు, భోజనం నాణ్యత తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధుల కాలంలో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి పిల్లలకు రక్తపరీక్షలు తరచూ చేయాలని ఆదేశించారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. పిల్లలకు వేడినీటిని అందించాలని సూచించారు. రాత్రి వేళల్లో తప్పకుండా పిల్లలు వద్ద రెగ్యులర్ సిబ్బంది ఉండి పర్యవేక్షణ చేయాలని తెలిపారు. ఈ పరిశీలనలో ట్రైబల్ వెల్ఫేర్ డీడీ అన్నదొర, ఏటీడబ్ల్యూఓ కృష్ణవేణి, మలేరియా అడిషనల్ డెరెక్టర్ ప్రసాదరావు, జోనల్ మలేరియా అధికారి శాంతిప్రభ, పాఠశాల హెచ్ఎం బిడ్డిక ఉమ, అధ్యాపకులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ టోర్నీ బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్ ఆవిష్కరణ అనంతరం టోర్నీ వివరాలను వెల్లడిస్తున్న కె.సాగర్, సంఘ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళంలోని శాంతినగర్‌కాలనీలో ఉన్న డీఎస్ఏ ఇండోర్ స్టేడియం వేదికగా ఈ నెల 13, 14 తేదీల్లో జరగనున్న జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ టోర్నీని విజయంతం చేయాలని బ్యాడ్మింటన్ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు కిల్లంశెట్టి సాగర్ పిలుపునిచ్చారు. నారాయణశెట్టి వెంకటశ్రీనివాసులు(వాసు) మెమోరియల్ జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్– 2024 పేరిట నిర్వహిస్తున్న ఈ పోటీలకు సంబంధించిన బ్రోచర్‌ను సంఘ ప్రతినిధులతో కలిసి మంగళవారం స్థానిక ఇండోర్ స్టేడియంలో ఆయన ఆవిష్కరించారు. ఇక్కడ రాణించి విజేతలుగా నిలిచిన క్రీడాకారులను రాష్ట్రపోటీలకు పంపించనున్నామని, పోటీలకు హాజరయ్యే క్రీడాకారులకు ఉచిత వసతి, భోజన ఏర్పాట్లు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా సీఈఓ సంపతిరావు సూరిబాబు తెలిపారు. జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొనదలిచే క్రీడాకారులు వెంటనే తమ ఎంట్రీలను నమోదు చేసుకోవాలని బ్యాడ్మింటన్ సంఘ ప్రతినిధులు కోరుతున్నారు. సంపతిరావు సూరిబాబు సెల్ 94402 55255, 83285 14385 నంబర్లకు కాల్‌చేసి తమ వివరాలను నమోదుచేసుకోవాలని కె.సాగర్, ఎం.అశోక్‌కుమార్ వెల్లడించారు.

'భూములపై ఆదివాసీలకు హక్కులు కల్పించాలి'



ఆర్డీఓను కలిసిన ఆదివాసీ నాయకులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జలుమూరు మండలం, ఎస్టీ మాకివలస గ్రామానికి చెందిన ఆదివాసీలు వందేళ్లుగా సాగు చేస్తున్న భూమిపై వారికి భూహక్కు పత్రాలు ఇప్పించాలని ఆదివాసీ సంఘ నాయకులు మంగళవారం శ్రీకాకుళం రెవెన్యూ డివిజనల్ అధికారి రంగయ్యకు ఆయన కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఇటీవల ఓ భూస్వామి ఆ భూమిపై ఆదివాసీలను బెదిరించారని, దీంతో ఆదివాసీలంతా ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఆదివాసులకు న్యాయం చేయాలని కోరారు. ఆర్డీఓను కలిసిన వారిలో ఆదివాసీ నాయకులు ఓబ యోగేశ్వరరావు ఉన్నారు.

యూనిఫారాలను సకాలంలో అందజేయాలి

పలాస: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అందజేస్తున్న యూనిఫాం దుస్తులను సకాలంలో అందజేయాలని జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు సూచించారు. పలాస ఎమ్మార్సీ కార్యాలయాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. కార్యాలయంలో ఉన్న దుస్తులు ఇతర పాఠ్యపుస్తకాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు ఎంతమందికి యూనిఫాం దుస్తులను అందజేశారని స్థానిక ఎంఈఓను ప్రశ్నించారు. రికార్డుల్లో ఉన్న దుస్తులకు, గోదాంలో ఉన్న దుస్తులకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.